ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి

ఆరోగ్యశ్రీ పరిధి పెంపు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తదితరులు

'మహాలక్ష్మి' పథకంలో భాగంగా జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి
- ఆరోగ్య శ్రీ పరిధి పెంపు కార్యక్రమం ప్రారంభం
- 'మహాలక్ష్మి'ని ప్రారంభించిన ఆర్డీవో

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 10: ఆరోగ్య శ్రీ పరిధిని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచారని, దీనిని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పెంచిన ఆరోగ్యశ్రీ పథకం గోడ ప్రతులను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు గతంలో ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్య సేవలు అందించే వారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రూ.పది లక్షలకు పెంచిందని తెలిపారు. రాష్ట్రంలో 85లక్షల కుటుంబాలు ఈ పథకానికి అర్హులుగా ఉన్నారన్నారు. ఈ పథకంలో 1372 రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ పథకం ద్వారా డయాలసిస్ రోగులకు పింఛన్ కూడా వస్తుందని ఆమె తెలిపారు.

మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించిన ఆర్డీవో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎల్లారెడ్డిలో లింగంపేట జడ్పీటీసీ శ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి, ఆర్డీవో ప్రభాకర్ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్ జెండా ఊపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ శ్రావణ్, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు చెన్న లక్ష్మణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, నాగం గోపి, షేక్ గయాజుద్దీన్, విద్యాసాగర్, పప్పు వెంకటేశం, ఏఎన్ఎంలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చివరిదశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

తాడ్వాయి, డిసెంబర్ 10: మండలంలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. మండలంలోని నందివాడ, క్రిష్ణాజివాడి, సోమారం, బ్రాహ్మణపల్లి, తాడ్వాయి, బ్రహ్మజివాడి, కరడ్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. నెల రోజులుగా కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయని, ఎవరైనా రైతులు ఇంకా విక్రయించకుంటే, వెంటనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

పరుగుపందెంలో ప్రతిభ

ప్రశంసాపత్రం అందుకుంటున్న లక్ష్మణ్

పిట్లం, డిసెంబర్ 10: నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన తక్కడపల్లి లక్ష్మణ్ సత్తా చాటాడు. పోటీలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో మండల ప్రజలు, యువకులు హర్షం వ్యక్తంచేశారు. పోటీలో గెలుపొందిన లక్ష్మణ్‌కు నిర్వాహకులు బొబ్బిలి నర్సయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

మార్మోగుతున్న అయ్యప్ప స్వామి శరణుఘోష

ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మాలధారులు, భక్తులు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 10: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయపూజారి శ్రీనివాస్‌రావు, చంద్రం గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఎల్లారెడ్డి, లింగంపేట, బాచుపల్లి గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి 11 రకాల అభిషేకాలు చేసిన అనంతరం అర్చన, శరణుఘోష, నమస్కార మంత్రాలు, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అందంగా అలంకరించిన పద్దెనిమిది మెట్లను కర్పూరంతో వెలిగించారు. అనంతరం పడిపూజకు వచ్చిన భక్తులకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు అవుసుల సంతోష్, దేశబోయిన సాయిలు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌నాథ్, ఓర శ్రీనివాస్, ఓర భీమయ్య, ప్యాలాల రాములు, లింగంపేట గురుస్వామి చంద్రమౌళి, పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధారి అయ్యప్ప ఆలయంలో..

గాంధారి, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప మాలధారులు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో భిక్ష ఏర్పాటు చేశారు.

భూదాతకు ఘన నివాళి

ఇనానీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మద్నూర్ గ్రామస్తులు

మద్నూర్, డిసెంబర్ 10: మండలకేంద్రంలో పాఠశాల, దవాఖాన, కళాశాలకు భూమిని విరాళంగా ఇచ్చిన దాత రాంప్రసాద్ ఇనానీకి గ్రామస్తులు ఆదివారం నివాళులర్పించారు. ఆదివారం ఇనానీ జయంతి సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా గ్రామానికి ఇనానీ కుటుంబసభ్యులు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. వారి కుమారుడు లక్ష్మీకాంత్ ఇనానీ మాట్లాడుతూ.. తాము ఎళ్లవేలలా గ్రామానికి అండగా ఉంటామని, ఇంకా ఏదైనా అవసరం ఉంటే తాము చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దరాస్ సురేశ్, ఉపసర్పంచ్ విఠల్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, గ్రామస్తులు తమ్మేవార్ రమేశ్, గోవింద్ కంకాణి, పప్పుసేట్, సురేశ్‌చంద్ర, యాదవ్‌రావు, శివాజీ, బాల్‌కిషన్, తుకారాం, బాల్‌కిషన్, కృష్ణ, నాగేశ్, అజయ్, రాములు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

రాచ్చేశ్వర ఆలయంలో పూజలు

డోంగ్లీ, డిసెంబర్ 10: మండలంలోని ఎన్‌బుర రాచ్చేశ్వర ఆలయంలో కార్తికమాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొన్నది. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాల్టా చట్టానికి తూట్లు

సింగీతం శివారులో ఇటుకబట్టీకి వినియోగించేందుకు సిద్ధంగా ఉన్న కలప

నిజాంసాగర్, డిసెంబర్ 10: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ఇటుక బట్టీల నిర్వాహకులు రాత్రికి రాత్రే అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికి వేస్తూ ఇటుక బట్టీలకు వినియోగిస్తున్నారు. ఓ వైపు చెట్లను పెంచాలని పర్యావరణాన్ని కాపాడాలంటూ అధికారులు సూచిస్తుంటే.. ఇటుక బట్టీల నిర్వాహకులు మాత్రం అక్రమంగా బట్టీలను ఏర్పాటు చేయడంతోపాటు వ్యవసాయానికి వినియోగించే విద్యుత్‌ను కూడా వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఖోఖో పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రామారెడ్డి, డిసెంబర్ 10: మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల 9వ రాష్ట్రస్థాయి క్రీడలు కొనసాగుతున్నాయి. క్రీడా పోటీల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అండర్-14, -17, -19 విభాగాల్లో హ్యాండ్ బాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. అండర్-19 విభాగం వంద మీటర్ల పరుగు పందెం పోటీలో కే.మల్లేశ్(జేపీ నగర్), అండర్-17 విభాగం 500 మీటర్ల పరుగుపందెంలో కేదార్‌సింగ్ (బోధన్), అండర్-14 హైజంప్‌లో ఎన్.రాంచరణ్, అండర్-14 షాట్‌పుట్‌లో కె.సంకేత్(కాసీపేట్) విజయం సాధించారు. ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీలు లీగ్ దశలో ఉన్నాయని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. క్రీడలను నిజామాబాద్ రీజినల్ కో-ఆర్డినేటర్ కె.అలివేలు ఆదివారం సందర్శించారు.